## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు స్ట్రోక్?

బీజింగ్ : చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు స్ట్రోక్ వచ్చిందా? అంటే అవుననే అంటున్నది ఆ దేశ సామాజిక మాధ్యమం. సీసీపీ మూడో ప్లీనరీ సమయంలో ఆయన స్ట్రోక్‌కు గురైనట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నది. మెదడుకు రక్తం సరఫరా చేసే నాళాల్లో పూడికలు ఏర్పడినప్పుడు, మెదడులో రక్తస్రావం జరిగినప్పుడు స్ట్రోక్ సంభవిస్తుంది. ఆయనకు స్ట్రోక్ వచ్చిన విషయాన్ని అధికారికంగా నిర్ధారించ లేదు. ఆయనకు స్ట్రోక్ వచ్చినట్టు జెన్నిఫర్ అనే రిపోర్టర్ వెల్లడించారు. 2021లో కూడా జిన్‌పింగ్ సెరిబ్రల్ ఎన్యూరిజంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందారు.

## బీహార్‌లో కూలిన మరో వంతెన

పాట్నా: బీహార్‌లో మరో వంతెన కుప్పకూలింది. దీంతో ఒక నెల వ్యవధిలో కూలిన వంతెనల సంఖ్య 15కు పెరిగింది. తాజాగా, కోసి నది వరదల కారణంగా ఆరారియా జిల్లాలోని చిన్న వంతెన కూలిపోయింది. 2017లో గ్రామీణాభివృద్ధి పథకం క్రింద రూ.1.25 కోట్లతో దీనిని నిర్మించారు. ఇది బీటలువారినట్లు అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోలేదని అమ్వారా పంచాయతీ గ్రామస్థులు తెలిపారు. ఇది కూలిపోవడంతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు.

## 'మహా' డిప్యూటీ సీఎంలకు తప్పిన ప్రమాదం

**ప్రతికూల వాతావరణంతో దారితప్పిన హెలికాప్టర్**

ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎంలు అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్ ఇద్దరూ తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బుధవారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు నాగపూర్ నుంచి గడ్చిరోలి వెళుతుండగా.. వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణంలో చిక్కుకొని దారి తప్పింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో హెలికాప్టర్ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. హెలికాప్టర్‌లో వారితో పాటు రాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ కూడా ఉన్నారు. 'రుతుపవన మేఘాలు ఒక్కసారిగా కమ్ముకోవడంతో హెలికాప్టర్ దారి తప్పింది. ఆ సమయంలో నేనెంతో భయపడ్డా'నని అజిత్ పవార్ అన్నారు.

# 'ఏడాదికి రెండుసార్లు' పరీక్షలపై డైలమా

- విస్తృత సంప్రదింపుల్లో సీబీఎస్‌ఈ
- సెమిస్టర్ విధానం మరో ఆప్షన్
- 10, 12 తరగతుల బోర్డు పరీక్షలపై తర్జన భర్జన

న్యూఢిల్లీ, జూలై 17: 2025-26 విద్యా సంవత్సరం నుంచి 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించే విషయంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) డైలమాలో ఉన్నట్టు కనిపిస్తున్నది. ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నది. మరోవైపు సెమిస్టర్ విధానంలో పరీక్ష నిర్వహణ ఆప్షన్ కూడా సీబీఎస్‌ఈ ముందున్నది. దీనిపై విస్తృత సంప్రదింపులు జరుగుతున్నాయని, ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలను ఎప్పుడు, ఏ విధానంలో నిర్వహించాలనే దానిపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.



ప్రస్తుతం 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను ఫిబ్రవరి-మార్చిలో నిర్వహిస్తున్నారు. కాగా, బోర్డు పరీక్షలను ఏడాదికి రెండు సార్లు నిర్వహించాలని కొత్త జాతీయ కరిక్యూలమ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సీఎఫ్) సిఫారసుల్లో ఉన్నది. రెండు సార్లు పరీక్షలను ఎప్పుడు నిర్వహించాలనే దానిపై సీబీఎస్‌ఈ ముందు జనవరి-ఫిబ్రవరి, మార్చి-ఏప్రిల్, జూన్ ఆప్షన్లు ఉన్నాయి. విద్యా సంవత్సరం రూపకల్పన విధానం, పోటీ పరీక్షల షెడ్యూల్, సీబీఎస్‌ఈ పాఠశాలలు దేశంతోపాటు విదేశాల్లోనూ ఉండటం దృష్ట్యా సెమిస్టర్ విధానం అంతగా ఆచరణీయమైనదిగా కనిపించడం లేదని అధికారి ఒకరు పేర్కొన్నారు.


**ఒక్కసారి నిర్వహణకే భారీ కసరత్తు**

ప్రస్తుతం ఉన్న పరీక్షా విధానంలో 10, 12వ తరగతి బోర్డు పరీక్షల నిర్వహణకు 150కి పైగా స్టెప్‌లు అవసరం అవుతాయని సీబీఎస్‌ఈ కేంద్ర విద్యా శాఖకు వెల్లడించింది. విద్యార్థుల జాబితా నుంచి సెంటర్ నోటిఫికేషన్లు, రోల్ నంబర్ల విడుదల, ప్రాక్టికల్స్ నిర్వహణ, థియరీ పరీక్షలు, ఫలితాల ప్రకటన, వెరిఫికేషన్, రీవాల్యూయేషన్ వంటి మొత్తం ప్రక్రియ కనీసంగా 310 రోజులు సాగుతుందని, రెండు పరీక్షలు నిర్వహించాలంటే కనీసం 55 రోజుల సమయం పడుతుందని తెలిపింది. ఈ నేపథ్యంలో రెండో రౌండ్ పరీక్షలకు ఇంతటి భారీ కసరత్తును ఎప్పుడు, ఎలా చేయాలనేది ప్రస్తుతం సీబీఎస్‌ఈకి సవాల్‌గా మారింది. ఫిబ్రవరి కంటే ముందు పరీక్షలు నిర్వహించడం కష్టమని, కొన్ని రాష్ట్రాల్లో అప్పుడు విపరీతమైన మంచు కాలం ఉంటుందని అధికారి ఒకరు పేర్కొన్నారు.

## 12 మంది నక్సల్స్ మృతి

మొదటిపేజీ తరువాయి...

మావోయిస్టులు ప్రచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు భద్రతా దళాలు గాలింపు చేపట్టగా వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఎస్‌ఐ సతీశ్ పాటిల్, మరో ఇద్దరు జవాన్లు గాయపడగా వారిని హెలికాప్టర్‌లో తరలించారు. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మూడు ఏకే-47లు, రెండు ఇన్‌సాస్‌లు, ఒక కార్బైన్, ఒక ఎస్‌ఎల్‌ఆర్, ఇతర వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో తిప్పగఢ్ దళానికి చెందిన డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం, విశాల్ ఆత్రం ఉన్నట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఈ ఆపరేషన్ గురించి ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ గడ్చిరోలి పోలీసుల కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తనకు ఎస్పీ, ఐజీలు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ఇటీవలి కాలంలో ఇదే అతిపెద్ద ఆపరేషన్ అని చెప్పారు. గడ్చిరోలి పోలీసులను అభినందించారు. వారికి 51 లక్షల రివార్డును ప్రకటించారు.



## భారత్‌కు చేరుకున్న ఛత్రపతి శివాజీ 'వ్యాఘ్ నఖ్'

**19 నుంచి బహిరంగ ప్రదర్శన**

ముంబై : ఛత్రపతి శివాజీ వినియోగించిన వ్యాఘ్ నఖ్ (పులిపంజా ఆకారంలో ఉండే ఆయుధం) భారత్‌కు వచ్చేసింది. లండన్ మ్యూజియం నుంచి బుధవారం తీసుకువచ్చినట్టు కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి సుధీర్ ముంగంటివార్ తెలిపారు. ఈ వ్యాఘ్ నఖ్‌ను ఈ నెల 19 నుంచి మ్యూజియంలో ఏడు నెలల పాటు ప్రదర్శనకు ఉంచనున్నట్టు ఆయన చెప్పారు. 1659లో సతార యుద్ధంలో వ్యాఘ్ నఖ్ అయుధంతోనే బీజాపూర్ సుల్తాన్ అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ మట్టుబెట్టారు. వ్యాఘ్ నఖ్‌ను మహారాష్ట్రకు తీసుకురావడానికి 14.08 లక్షలు మాత్రమే వ్యయం చేసినట్టు సుధీర్ చెప్పారు.


## 7 రోజుల్లో 7 ప్రపంచ వింతల సందర్శన

**ఈజిప్టు వాసి గిన్నిస్ రికార్డు**

న్యూఢిల్లీ: ప్రపంచంలో కొత్తగా గుర్తింపు పొందిన ఏడు వింత ప్రదేశాలు, కట్టడాలను ఓ ఈజిప్షియన్ ఏడు రోజుల్లో సందర్శించి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకున్నారు. ఆయన యాత్రకు సంబంధించిన అంశాలతో ఓ వీడియోను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. సాహస యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన మగ్డీ ఎయిస్సా (45) మాట్లాడుతూ, 6 రోజుల, 11 గంటల, 52 నిమిషాల్లో ఈ రికార్డును సృష్టించానని చెప్పారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాతో యాత్ర ప్రారంభమైందని, ఆ తర్వాత తాజ్ మహల్, పురాతన నగరం పెట్రా, కొలోసియం, క్రైస్ట్ ది రిడీమర్, పెరూలోని మచ్చు పిచ్చులను సందర్శించానన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మాత్రమే ఉపయోగించుకున్నట్లు తెలిపారు.

## పిల్లలకు వ్యాక్సిన్లలో భారత్ వెనుకబాటు

న్యూఢిల్లీ, జూలై 17: ఇతర ప్రపంచ దేశాలతో పోలిస్తే పిల్లలకు వ్యాక్సినేషన్ విషయంలో భారత్ చాలా వెనుకబడి ఉన్నదని డబ్ల్యూహెచ్‌వో, యూనిసెఫ్ తాజా నివేదిక వెల్లడించింది. రెండు నెలల వయసులో ఇచ్చే డీటీపీ(డిఫ్తీరియా, టెటానస్, పెర్టుసిస్) మొదటి డోస్ మిస్ అయిన చిన్నారుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 2022లో దాదాపు 1.39 కోట్ల మంది ఉండగా.. 2023కు ఆ సంఖ్య 1.45 లక్షలకు పెరిగిందని తెలిపింది.




## ఇన్‌స్టాగ్రామ్‌లో విడాకులిచ్చిన దుబాయ్ యువరాణి



న్యూఢిల్లీ: దుబాయ్ యువరాణి షైకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తౌమ్ తీసుకున్న ఓ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనమైంది. భర్త షేక్ మనాబిన్ మొహమ్మద్ బిన్ రషీద్ బిన్ మన్ అల్ మక్తౌమ్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విడాకులు ఇచ్చారు. రెండు నెలల క్రితమే ఈ దంపతులు తొలి బిడ్డకు జన్మనిచ్చారు. అంతలోనే యువరాణి ఈ నిర్ణయం తీసుకోవడం, పైగా దానిని సోషల్ మీడియా ద్వారా ప్రకటించడం చర్చనీయాంశమైంది. ''డియర్ హజ్బెండ్.. మీరు ఇతరుల సహచర్యాన్ని కోరుకోవడంతో నేను విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నా. నేను మీకు విడాకులు ఇస్తున్నా.. నేను మీకు విడాకులు ఇస్తున్నా.. నేను మీకు విడాకులు ఇస్తున్నా. టేక్ కేర్. మీ మాజీ భార్య'' అని షైకా ముమ్మారు తలాక్ చెబుతూ ఇన్‌స్టాలో పోస్టు చేశారు. ఆ వెంటనే ఈ వార్త వైరల్ అయింది. షేక్ మనాబిన్‌కు నిరుడు మేలోనే వివాహమైంది. రెండు నెలల క్రితమే ఓ పాపకు వీరు తల్లిదండ్రులయ్యారు. షైకా మహ్రా దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తౌమ్ కుమార్తె.

## 'ఇన్సూరెన్స్' మాదిరిగా సీబీఐ అరెస్ట్ చేసింది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైల్లో ఉంచాలనే ఉద్దేశంతోనే సీబీఐ ఆయనను అరెస్ట్ చేసిందని ఆయన తరఫు న్యాయవాది ఆరోపించారు. సీబీఐ కేసులో తన అరెస్టును సవాల్ చేయడంతో పాటు మధ్యంతర బెయిల్ కోరుతూ సీఎం కేజ్రీవాల్ దాఖలుచేసిన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఈడీ కేసులో కేజ్రీవాల్ బయటకు వస్తారేమోనన్న భయంతోనే ముందస్తుగా ఇన్సూరెన్స్ మాదిరిగా ఆయనను అరెస్టు చేసిందని ఆరోపించారు. అయితే ఈ వాదనను సీబీఐ కొట్టివేసింది. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు.. తీర్పును వాయిదా వేసింది.

## మహిళా ఉద్యోగార్థులకు గర్భ నిర్ధారణ పరీక్షలు

- పలు చైనా కంపెనీల నిర్వాకం
- ప్రభుత్వం చట్టపరమైన చర్యలు!

బీజింగ్, జూలై 17: ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు చైనా కంపెనీలు గర్భనిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నాయి. ఇందులో పాజిటివ్ వస్తే ఉద్యోగం ఇచ్చేందుకు సంకోచిస్తున్నాయి. డజనుకుపైగా కంపెనీలపై ఇలాంటి ఆరోపణలు రాగా, ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. జియాంగ్సులోని నాన్‌టోంగ్ పట్టణంలో 16 కంపెనీలపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్టు తెలిసింది. నియామకాలు పొందిన 168 మంది మహిళలు, ముందస్తు ఫిజికల్ టెస్ట్‌లు చేసుకున్నట్టు ప్రాసిక్యూటర్స్ గుర్తించారు. దర్యాప్తులో భాగంగా రెండు ప్రధాన దవాఖానలను, ఒక మెడికల్ ఎగ్జాం సెంటర్‌కు వెళ్లి ప్రాసిక్యూటర్స్ విచారించారు. ఫ్యామిలీ ప్లానింగ్ లేకపోయినా, పిల్లల్ని కనాలనుకునే ఉద్దేశమున్నా, గర్భంతో ఉన్నా.. అలాంటి మహిళలను ఇంటర్వ్యూ దశలోనే చైనాలోని పలు కంపెనీలు పక్కకు తప్పిస్తున్నాయి. వారికి ఉద్యోగం ఇవ్వడానికి విముఖత చూపుతున్నాయి. ప్రెగ్నెన్సీ టెస్ట్‌లు అడుగుతున్నాయి. అయితే ఇలా చేయటం చైనా చట్టాల ప్రకారం నేరం. ప్రెగ్నెన్సీతో ఉన్న కార్మికుల పట్ల వివక్ష చూపరాదు.

## ప్రజాప్రయోజనాల కోసం చేసే స్టింగ్ ఆపరేషన్లు చట్టబద్ధమే

**కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు**

కొచ్చి : ప్రజా ప్రయోజనాల కోసం మీడియా సంస్థలు చేసే స్టింగ్ ఆపరేషన్లు చట్టబద్ధమేనని కేరళ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఎవరైనా వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని అవమానించడానికి దురుద్దేశంతో చేసే స్టింగ్ ఆపరేషన్లకు చట్టం మద్దతు ఉండదని స్పష్టం చేసింది. నిజాన్ని వెలికితీసి, ప్రజలకు చేర్చాలనే ఉద్దేశంతో స్టింగ్ ఆపరేషన్ చేస్తే విచారణ నుంచి మినహాయింపు ఉంటుందని కోర్టు పేర్కొన్నది. 2013లో సోలార్ కుంభకోణం కేసులో ఇద్దరు రిపోర్టర్లు పతనంథిట్ట జిల్లా జైలుకు వెళ్లి నిందితుడి స్టేట్‌మెంట్‌ను చాటుగా రికార్డు చేశారు. దీంతో వారిపై జైళ్ల చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసును కొట్టేస్తూ కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ పై వ్యాఖ్యలు చేశారు. పాలకుల్లో జవాబుదారీతనం తీసుకురావడం, అధికార దుర్వినియోగం, తప్పులు చేయకుండా చూసే బాధ్యత ఫోర్త్ ఎస్టేట్‌కు ఉంటుందని న్యాయమూర్తి అన్నారు.

వాణిజ్య

# చిన్న షేర్లు..పెద్ద లాభాలు

**ఈ ఏడాది 30 శాతం ఎగిసిన బీఎస్‌ఈ మిడ్‌క్యాప్**

**27 శాతం ఎగబాకిన స్మాల్‌క్యాప్ సూచీ**

న్యూఢిల్లీ, జూలై 17: దేశీయ స్టాక్ మార్కెట్లలో పెద్ద షేర్ల కంటే.. చిన్న షేర్లే ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మదుపరులకు ఎక్కువగా లాభాలను పంచినవి స్మాల్, మిడ్ స్టాక్సే మరి. జనవరి మొదలు ఈ నెల 16దాకా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) మిడ్‌క్యాప్ సూచీ 10,984.72 పాయింట్లు లేదా 29.81 శాతం ఎగిసింది. అలాగే స్మాల్‌క్యాప్ సూచీ 11,628.13 పాయింట్లు లేదా 27.24 శాతం ఎగబాకింది. ఇదే సమయంలో లార్జ్‌క్యాప్ ఇండెక్స్‌గా పరిగణించే సెన్సెక్స్ 8,476.29 పాయింట్లు లేదా 11.73 శాతమే పెరిగింది.



**ఇదీ సంగతీ..**

మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్), ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీల్లోకి పెద్ద ఎత్తున దేశీయ మదుపరుల నుంచి నగదు మొత్తాలు రావడమే ఈ లాభాలకు కారణమని స్టాక్ మార్కెట్ నిపుణులు ఈ ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. పెద్ద షేర్లుండే సెన్సెక్స్ కూడా బాగానే పరుగులు పెట్టిందని, అయితే విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) అమ్మకాలు ప్రభావితం చేశాయని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతీ అన్నారు. మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ రికార్డు స్థాయిలో 80,898.30 వద్ద ముగిసింది. అలాగే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా మునుపెన్నడూ లేనివిధంగా 48,175.21 వద్ద, 54,617.75 వద్ద నిలిచాయి.

**ఎల్ఐసీ షేర్లు 79 శాతం వృద్ధి**

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) షేర్ విలువ.. గడిచిన ఏడాది కాలంలో 79 శాతం పుంజుకున్నది. గత ఏడాది జూలై 18న బీఎస్ఈలో రూ.620గా ఉన్న ఎల్ఐసీ షేర్.. మంగళవారం (ఈ జూలై 16) రూ.1,109.15 వద్ద స్థిరపడింది. రూ.489.15 పెరిగినట్లైంది. ప్రత్యర్థి సంస్థలు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ షేర్లతో పోల్చితే చాలా ఎక్కువగా తమ ఇన్వెస్టర్లకు ఎల్ఐసీ లాభాలను పంచడం విశేషం. ఇక హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్ విలువ నిరుడు ఇదే సమయంలో రూ.666.55 వద్ద ఉంటే.. ఇప్పుడు రూ.646.55 వద్ద ఉన్నది. రూ.20 తగ్గింది. అలాగే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్ విలువ 12 శాతమే పెరిగింది. గత ఏడాది జూలై 18న రూ.582గా ఉన్నది. ప్రస్తుతం రూ.654.10 వద్ద ముగిసింది. మరో ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎస్బీఐ లైఫ్ కూడా ఎల్ఐసీతో చూస్తే వెనుకబడింది. గడిచిన ఏడాది కాలంలో రూ.1,314 నుంచి రూ.1,621.20 వరకే పెరిగింది. ఇన్వెస్టర్లకు 23 శాతం రాబడులనే అందించింది.

**కలిసొచ్చిన బుల్ రన్**

వరుస లాభాల్లో స్టాక్ మార్కెట్లు పరుగులు పెట్టడం.. బ్లూచిప్ షేర్లకేగాక, చిన్న-మధ్యతరహా సంస్థల షేర్లకూ కలిసొచ్చిందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అమెరికాసహా, ఎన్నో దేశాల స్టాక్ మార్కెట్లు లాభాల్లో నడుస్తున్నాయంటున్న విశ్లేషకులు.. ఆ ఉత్సాహం భారతీయ స్టాక్ మార్కెట్లలోనూ ఉందంటున్నారు. దీనికితోడు దేశీయ మదుపరుల వద్ద సమృద్ధిగా ఉన్న నగదు నిల్వలు, భారత ఆర్థిక వ్యవస్థకున్న బలమైన మూలాలూ లాభించాయని వారు చెప్తున్నారు. కాగా, ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేసిన ఎఫ్ఐఐలు.. ద్వితీయార్ధం (జూలై-డిసెంబర్)లో షేర్ల కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తారన్న అంచనాలున్నాయని నిపుణులు చెప్తుండటం గమనార్హం. దీంతో ఇకపై ఈ ఏడాది సెన్సెక్స్ షేర్లు ఇంకా పుంజుకుంటాయని అంటున్నారు.



బుధవారం సనోఫీ జీసీసీ సెంటర్‌ను ఆ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

## హైదరాబాద్‌లో సనోఫి జీసీసీ విస్తరణ

**ఆరేండ్లలో రూ.3,600 కోట్ల పెట్టుబడి పెట్టనున్న సంస్థ**

హైదరాబాద్, జూలై 17: అంతర్జాతీయ హెల్త్‌కేర్ సేవల సంస్థ సనోఫి ఇండియా..హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌ను మరింత విస్తరించనున్నట్లు ప్రకటించింది. వచ్చే ఆరేండ్లలో 400 మిలియన్ యూరోల(రూ.3,600 కోట్లు) నిధులతో ఈ సెంటర్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దనున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మడేలిన్ రోచ్ తెలిపారు. దీంతో హైదరాబాద్ సెంటర్ అంతర్జాతీయ హబ్‌లలో ఇదే అతిపెద్దదయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ విస్తరణతో కొత్తగా 2,600 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఈ సెంటర్‌లో వెయ్యి మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ నూతన పెట్టుబడులను కొత్తగా కంపెనీలను కొనుగోలు చేయడానికి, నూతన ఆవిష్కరణలు జరిపేందుకు వినియోగించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..ప్రపంచ ఫార్మాస్యూటికల్ రంగంలో తెలంగాణ ప్రాముఖ్యత అంతకంతకు పెరుగుతున్నదని, హైదరాబాద్‌లో సనోఫి జీసీసీ సెంటర్‌ను విస్తరించడం ఇదొక మైలురాయి వంటిదని పేర్కొన్నారు. హైదరాబాద్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో 50 శాతం మంది పీహెచ్‌డీలు, ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్‌లో మాస్టర్ చేసిన వారు ఉన్నారు. అలాగే 10 శాతం మంది ఫ్రెషర్లు కాగా, 20 శాతం మంది టెక్నాలజీ నిపుణులు.

## విభోర్ ప్లాంట్ సామర్థ్యం రెట్టింపు

హైదరాబాద్, జూలై 17: మహబూబ్‌నగర్‌లో ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తున్నట్లు విభోర్ స్టీల్ ట్యూబ్స్ ప్రకటించింది. ఈ యూనిట్‌లో కొత్తగా జీఐ(గల్వానీజింగ్ ఐరన్) యూనిట్‌ను ప్రారంభించడం వల్లనే ఈ ప్లాంట్ కెపాసిటీ 24 వేల టన్నుల నుంచి 48 వేల టన్నులకు చేరుకున్నదని కంపెనీ ఎండీ విభోర్ కౌశిక్ తెలిపారు. ఈ ప్లాంట్ సామర్థ్యం రెట్టింపు చేయడంతో దేశవ్యాప్తంగా కస్టమర్లకు అందించడానికి వీలు పడనున్నదని, భవిష్యత్తులో ఈ యూనిట్ స్టీల్ ట్యూబ్స్, పైప్స్ ఇండస్ట్రీకి కేంద్ర బిందువుగా మారుతున్నదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. హర్యాన కేంద్రంగా సేవలు అందిస్తున్న వీఎస్‌టీఎల్‌కు దేశవ్యాప్తంగా మహారాష్ట్రలో, తెలంగాణలో ప్లాంట్లు ఉన్నాయి. ఈ రెండు యూనిట్లతో ఏటా 2.21 లక్షల టన్నులను ఉత్పత్తి చేస్తున్నది. అలాగే ఒడిశాలో ఏర్పాటు చేయతలపెట్టిన ప్లాంట్ అందుబాటులోకి వస్తే మొత్తం సామర్థ్యం 3.41 లక్షల టన్నులకు చేరుకోనున్నది.



*రాయల్ ఎన్‌ఫీల్డ్ సరికొత్త గెరిల్లా 450 బైక్‌ను పరిచయం చేసింది. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధర రూ. 2.39 లక్షలు. ఐదు కలర్లు, మూడు వేరియంట్లలో వచ్చిన ఈ మోటర్ సైకిల్ రిటైల్ అమ్మకాలు దేశీయంగా ఆగస్టు 1 నుంచి మొదలవుతాయి.*


## ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రాఫిట్ డౌన్

ముంబై, జూలై 17: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఎల్‌టీఐమైండ్‌ట్రీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,135 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 1.5 శాతం తగ్గినట్లు పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5 శాతం ఎగబాకి రూ.9,142.6 కోట్లకు చేరుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో దేబాషిస్ ఛటర్జీ మాట్లాడుతూ..గత త్రైమాసికంలో 1.4 బిలియన్ డాలర్ల విలువైన నూతన వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు, వరుస త్రైమాసికపు ఆదాయంతో పోలిస్తే 2.8 శాతం వృద్ధి నమోదైందన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగాల నుంచి వచ్చే ఆదాయం తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. కొత్తగా 1,400 మంది ఫ్రెషర్లు చేరినప్పటికీ మొత్తం ఉద్యోగులు 82,738 నుంచి 81,934కి తగ్గారు.

# బడ్జెట్‌లో పన్నులు తగ్గాలి

## దేశంలోని 56 శాతం మందిది ఇదే మాట

**ఉపాధి కల్పనకూ పెద్దపీట వేయాలన్న అభిప్రాయాలు • ఓ తాజా సర్వేలో వెల్లడి**




న్యూఢిల్లీ, జూలై 17: ద్రవ్యోల్బణం విజృంభిస్తున్న నేపథ్యంలో దేశంలో చాలామంది రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను (ఐటీ) కోతల్ని ఆశిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఈ నెల 23 (మంగళవారం)న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రకటించనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన ఓ సర్వేలో ఏకంగా 56 శాతం మంది ఆదాయ పన్నుల భారం నుంచి ఉపశమనాన్ని కోరుకుంటున్నట్టు తేలింది. నిజానికి ఇప్పటికే భారతీయ వ్యాపార, పారిశ్రామిక వర్గాలు సైతం ఇదే అంశాన్ని మోదీ సర్కారు దృష్టికి తీసుకెళ్లాయి. మార్కెట్‌లో వినిమయ సామర్థ్యం, కొనుగోలు శక్తి పెరగడానికి పన్ను కోతలు దోహదం చేస్తాయని, జనాల చేతుల్లో మరింత నగదు ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆర్థిక మంత్రిని కోరాయి.

**నిరుద్యోగ సమస్యపై..**

ఈసారి బడ్జెట్‌లో నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా కూడా అడుగులు వేయాలని 37 శాతం మంది కోరుకుంటుండటం గమనార్హం. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, వాటిని పెంచడంపై బడ్జెట్ దృష్టిపెడితే బాగుంటుందని ఎకనామిక్ టైమ్స్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ సర్వేలో అభిప్రాయపడ్డారు. అయితే గత రెండు పర్యాయాలతో పోల్చితే ఈ దఫా కేంద్రంలో మోదీ సర్కారుకు మెజారిటీ తగ్గిన సంగతి విదితమే. మిత్రపక్షాల మద్దతుతో గద్దెనెక్కాల్సి వచ్చింది. దీంతో ఈ బడ్జెట్‌లో ఇతర పార్టీల అభిప్రాయాలనూ బీజేపీ గౌరవించాల్సి వస్తున్నది. కాబట్టి పెద్దగా బడ్జెట్‌పై ఆశలు పెట్టుకోవద్దన్న అంచనాలూ వినిపిస్తున్నాయి. గతంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పన్ను తగ్గింపులకు ఇక ఆస్కారం లేదని చెప్పడం గమనార్హం. ట్యాక్స్ పేయర్లు తమకు ఏది లాభమో తెలుసుకుని కొత్త, పాత పన్ను విధానాలను ఎంచుకోవాలంటూ సూచించారు.

**సుంకాలను హేతుబద్ధం చేయాలి**

బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకాలను ప్రభుత్వం హేతుబద్ధం చేయాలని ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) కోరింది. ఇది దేశంలో ఉక్కు, సోలార్ బ్యాటరీ, అల్యూమినియం, లిథియం సెల్స్ తయారీకి ఊతమివ్వగలదని ఐసీసీ అధ్యక్షుడు అమేయ ప్రభు అన్నారు. విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి అవుతున్న ఆయా ముడి సరకులపై సుంకాలు భారంగా పరిణమించాయన్నారు. ఇదిలావుంటే తయారీ రంగంలో కొత్త కంపెనీల కోసం గతంలో ప్రకటించిన లాభదాయక పన్ను విధానాన్ని పొడిగించాలని ట్యాక్స్ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ అంటున్నది.

